# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025ను పార్లమెంట్ ఆమోదించింది.**
2. **ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు 'పల్లె నిద్ర' చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**
3. **ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**
4. **'అమరావతి జలహారతి కార్పొరేషన్' ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
5. **హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల అంశాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది.**

===========================

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025ను పార్లమెంట్ ఆమోదించింది. నిన్న రాజ్య సభ ఈ బిల్లుపై 12 గంటల పాటు చర్చ నిర్వహించి ఆమోదించింది. 128 మంది సభ్యులు దీనికి అనుకూలంగా ఓటు వేయగా, 95 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో ఉభయ సభల్లోనూ బిల్లు ఆమోదంపొందింది. నిన్న ఎగువసభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కిరణ్ రిజిజు చర్చ ప్రారంభించారు. వక్స్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం ఈ బిల్లు లక్ష్యమని తెలిపారు.

రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు 2025పై జరిగిన చర్చలో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... వక్ఫ్ చట్టం దేశంలో నూతన సంస్కరణగా అభివర్ణించారు. బిల్లు ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. వక్ఫ్ విరాళంగా ఇచ్చిన ఆస్తులను చట్టవిరుద్ధంగా విక్రయించడానికి ప్రయత్నించే వారిని జవాబుదారీగా ఉంచే బాధ్యత వక్ఫ్ బోర్డుపై ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఈ బిల్లు ముస్లింల మతపరమైన వ్యవహారాల్లో జోక్యం చేసుకోదని అమిత్ షా పేర్కొంటూ...

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో 'పల్లె నిద్ర' చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. అమరావతిలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశం

అనంతరం ముఖ్యమంత్రి మంత్రులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెలలో నాలుగురోజులపాటు ప్రజాప్రతినిధులు పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

-----------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితిని గురించి వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ,

వాయిస్ ..23 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈ రోజు, రేపు , మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికను జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని వెల్లడించింది.

-----------------------------

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో వర్షాలపై సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలవకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించాలని, ట్రాఫిక్ సమస్యను త్వరగా పరిష్కరించాలని అన్నారు. జిల్లాల్లోనూ అధికారులు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

-----------------------------

'అమరావతి జలహారతి కార్పొరేషన్' ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం తెలిపారు. ఆ వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వివరించారు. పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా ఈ ప్రత్యేక వాహన నౌక -ఎస్పీవీను ఏర్పాటు చేయనుందని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారధి వెల్లడిస్తూ...

వాయిస్..35 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుంచి తమిళనాడులోని పళనికి ఆర్టీసీ సర్వీసులను ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ నిన్న ప్రారంభించారు.గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం వద్ద పూజలు నిర్వహించి, రవాణాశాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరిలో షణ్ముఖ యాత్రలో భాగంగా పళని వెళ్లినప్పుడు అక్కడి నుంచి తిరుపతికి నేరుగా బస్ సదుపాయం లేదనే విషయాన్ని భక్తులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా కొత్త బస్సులు నడిపేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రెండు ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య బస్సు సదుపాయం కల్పించడం సంతోషంగా ఉందని చెప్పారు.

---------------------------

హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల అంశాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ ఉపసంఘం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కమిటీ, విద్యార్థుల ప్రతినిధులు, జాయింట్ యాక్షన్ కమిటీతో సహా భాగస్వాములైన ప్రతి ఒక్కరితో చర్చిస్తుందని ఈ మేరకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రుల ఉపసంఘం ఈ రోజు నుంచే వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులతో చర్చలు జరపనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లా ప్రధాన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ రోజు నుంచి 'స్లాట్ బుకింగ్' విధానం అమల్లోకి రానుంది. ఈ విధానాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈరోజు ప్రారంభిస్తారు. మిగిలిన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా ఈ నెల చివరినాటికి స్లాట్ విధానం అందుబాటులోకి రానుంది. ప్రతి రోజూ ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల మధ్య రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో పేర్కొన్న స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లకు ముందస్తు అపాయింట్‌మెంట్ పొందవచ్చు.

---------------------------

మంగినపూడి బీచ్‌ను గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌ను గతరాత్రి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మంగినపూడి బీచ్ అభివృద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయని, వాటర్ స్పోర్ట్స్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీచ్‌లో రాత్రిపూట కూడా ఉండేందుకు వీలుగా రిసార్టులు, దుస్తులు మార్చుకునే గదులు, సౌచాలయాలు, విశ్రాంతి గదులు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించనున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో సాగుచేసిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ధాన్యం ప్రతి క్వింటాకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు 500 రూపాయలు అదనపు ధరను కల్పిస్తామని చెప్పారు. రెండులక్షల లోపు 25 లక్షల 65 వేల మంది రైతులకు రుణమాఫీ చేశామని చెప్పారు.

--------------------------

బుడమేరుకి పడిన గండ్ల మరమ్మతులకు త్వరలో టెండర్లు పిలవనున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలో బుడమేరు ఆధునికీకరణపై నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వరదల సమయంలో బుడమేరుకు పడిన 3 గండ్ల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.

======================